

పశ్చిమ సిటింగ్ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు వైసీపీ అధిష్ఠానమే సీటు ఖరారు చేసిందా..? లేక తెరవెనుక పరిణామాలే ఆయనకు ఆ సీటు దక్కేలా చేశాయా..? ఇన్నాళ్లు సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పక్కనే ఉండి, వెనుక గోతులు తీశారా..? అనే సందేహాలు రాజకీయ వర్గాల్లో కలుగుతున్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో బుధవారం తనను కలవడానికి వచ్చిన వెలంపల్లి పట్ల మల్లాది ముభావంగానే ఉండటం.. తనకు సీటు దక్కకపోవడానికి వెలంపల్లే కారణమని విష్ణు తన అంతర్గత భేటీల్లో పేర్కొనడం.. పైన తెలిపిన ప్రశ్నలకు ఊతమిస్తున్నాయి.

సెంట్రల్ స్కెచ్..!

తెరవెనుక రాజకీయం వల్లే మల్లాదికి దక్కని సీటు



- ఏడాదిగా సెంట్రల్ నాయకులతో వెలంపల్లి పలుమార్లు భేటీ
- పశ్చిమలో సీటు దక్కదని ముందే సంకేతాలు
- దృష్టి మరల్చి ముందుగానే సెంట్రల్‌వైపు..
- ఇప్పటికి తెలుసుకున్న సిటింగ్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- వైసీపీని వీడి కాంగ్రెస్ గూటికి చేరాలని నిర్ణయం

పైకి అయిష్టంగా.. లోలోపల ఇష్టంగా..
సెంట్రల్ టికెట్ విషయంలో పైకి అసంతృప్తితో ఉన్నట్టు వెలంపల్లి ప్రవర్తిస్తున్నా అంతర్గతంగా మాత్రం తన పాచిక పారిందన్న సంతోషంలో ఉన్నారు. ఇప్పటికే ఆయన పలువురు సెంట్రల్ కార్పొరేటర్లకు వాట్సాప్ కాల్స్ చేసి తనకు ఇష్టం లేకపోయినా సీటు ఇచ్చారని, అధిష్ఠానం ఆదేశాలు కాదనలేక పోటీ చేస్తున్నానని, తనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఒకటి రెండు రోజుల్లో కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులతో ఆయన సమావేశాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : బెజవాడ బ్రదర్స్‌గా పేరొందిన వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు నడుమ సెంట్రల్ సీటు అగ్గి రాజేసింది. 2009 నుంచి విజయవాడ పశ్చిమలో పోటీచేస్తూ వచ్చిన వెలంపల్లి ఏడాదిగా సెంట్రల్ సీటుపై దృష్టిపెట్టారు. అక్కడి ముఖ్యనేతలతో తరచూ భేటీలు నిర్వహించేవారు. వీటిని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు లైట్ తీసుకున్నారు. ఇప్పుడు అదే ఆయన సీటుకు ముప్పు తెచ్చింది. వాస్తవానికి ఉమ్మడి కృష్ణా జిల్లాలో మిగిలిన వైసీపీ ఎమ్మెల్యేలతో పోలిస్తే మల్లాది విష్ణుపై అవినీతి ఆరోపణలు పెద్దగా లేవు. కానీ, మల్లాదికి వ్యతిరేకంగా అధిష్ఠానం వద్ద పావులు కదపడంలో, సానుకూల వాతావరణం లేదని పీకే టీం ద్వారా సంకేతాలు పంపడంలో వెలంపల్లి విజయం సాధించారు.

ఏడాది నుంచే సెంట్రల్‌పై స్కెచ్

పశ్చిమలో వైశ్య సామాజికవర్గం ఓట్లు నిర్ణయాత్మకంగా ఉంటాయి. అదే సామాజికవర్గానికి చెందిన వెలంపల్లికి పశ్చిమ నుంచి పోటీ చేయడమే సరైనది. కానీ మంత్రిగా ఉన్న సమయంలో తీవ్రమైన అవినీతి ఆరోపణలు రావడం, స్థానికంగానూ ఆయనపై వ్యతిరేకత ఉండటంతో పశ్చిమలో గెలుపు అసాధ్యమన్న నిర్ణయానికి వెలంపల్లి వచ్చారు. మరోవైపు అధిష్ఠానం సర్వేలోనూ అదే తేలడంతో వెలంపల్లి ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించారు. అందులో భాగంగా ఏడాదిగా సెంట్రల్ వైసీపీ నేతలతో టచ్‌లో ఉన్నారు. వారితో భేటీలు నిర్వహిస్తూ సెంట్రల్‌లో మార్గం సుగమం చేసుకుంటూ వచ్చారు. చివరికి వెలంపల్లి ప్లాన్ బి విజయవంతంగా అమలై ఆయనకు సెంట్రల్ టికెట్ ఇస్తున్నట్లు అధిష్ఠానం ప్రకటించింది.

వెలంపల్లి తీరుపై మల్లాది నజర్

వెలంపల్లి రాజకీయం కారణంగానే తనకు సెంట్రల్ సీటు దక్కకుండా పోయిందని మల్లాది విష్ణు భావిస్తున్నారు. ఇదే అభిప్రాయాన్ని ఆయన తన అంతర్గత భేటీల్లో వ్యక్తం చేసినట్లు సమాచారం. బుధవారం వెలంపల్లి తనను కలవడానికి వచ్చిన సమయంలో మల్లాది ముక్తసరిగా స్పందించడానికి కూడా అదే కారణంగా చెబుతున్నారు. జరిగిన పరిణామాలను విశ్లేషించుకున్న మల్లాది తిరిగి కాంగ్రెస్ గూటికి చేరాలని నిర్ణయించుకున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుని తిరిగి సెంట్రల్ నుంచే పోటీ చేయాలని ఆయన భావిస్తున్నారు. ఈ మేరకు షర్మిలతో ఆయన టచ్‌లోకి వెళ్లినట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

అవనిగడ్డలో డీఎస్సీ ఆశావహుల ధర్నా

- 6లో..

కదంతొక్కిన అంగన్వాడీలు

ముట్టడితో దద్దరిల్లిన కలెక్టరేట్


కలెక్టరేట్ వద్ద బైఠాయించిన అంగన్వాడీలు, సహాయకులు

మచిలీపట్నం టౌన్, జనవరి 3 : తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలు చేస్తున్న పోరాటం ఉధృతమైంది. 23 రోజులుగా సమ్మె చేస్తున్నా చలించని సర్కారు చెవికెక్కేలా బుధవారం చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి మోతమోగింది. అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తొలుత బస్టాండు సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్ వద్దకు చేరుకుని అక్కడే బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో అంగన్వాడీలను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించారు. అంగన్వాడీ కార్యకర్తల సంఘ జిల్లా అధ్యక్షురాలు నిర్మల జ్యోతి, కార్యదర్శి రమాదేవి, ప్రాజెక్టు కార్యదర్శి రెజీనారాణి, నాంచారమ్మ మాట్లాడారు. ఆందోళనకు సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు మద్దతు తెలిపారు.

పంటబీమా దక్కేనా?


దెబ్బతిన్న వరిపంట

పంటకోత ప్రయోగాల్లో అధిక దిగుబడులు వచ్చినట్టు నమోదు

పంటబీమా అమలులోని నిబంధనలు రైతులను అయోమయానికి గురిచేస్తున్నాయి. మిచౌంగ్ తుఫాను కారణంగా గతేడాది డిసెంబరు 4, 5 తేదీల్లో కురిసిన భారీవర్షాల కారణంగా పంట కోల్పోయిన రైతులకు పంటబీమా వర్తిస్తుందా? లేదా? అనే ఆందోళన వారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటికే పంట నష్టపరిహారం జాబితాలను జిల్లా వ్యవసాయ, రెవెన్యూశాఖల అధికారులు తయారు చేశారు. అధికారులు విడివిడిగా ఈ పంటకోత ప్రయోగాలు చేసి వచ్చిన దిగుబడిని నమోదు చేస్తారు. ఈ నివేదిక ఆధారంగానే పంటబీమా వచ్చే అవకాశం ఉంటుంది. రంగుమారిన, మొలకెత్తిన ధాన్యాన్ని కూడా దిగుబడిలో చూపడంతో రైతులకు ఎంత మేర పంట బీమా దక్కుతుందోనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- ఐదేళ్లలో వచ్చిన పంట దిగుబడిని అంచనా వేసి బీమా అమలు
- కలెక్టర్, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తేనే రైతులకు మేలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో ఏటా ప్రతి గ్రామంలో మూడు ప్రాంతాల్లో 1614 పంటకోత ప్రయోగాలను చేస్తారు. ఇప్పటివరకు జిల్లాలో 1218 పంటకోత ప్రయోగాలు పూర్తయ్యాయి. ఐదు మీటర్ల వెడల్పు, ఐదు మీటర్ల పొడవులో పంటను కోసి తూర్పారబట్టి ఎంత దిగుబడి వచ్చిందనే అంశంపై గ్రామస్థాయిలో వ్యవసాయ సహాయకుడి నుంచి జేసీ వరకు, జిల్లాలో పంటబీమాను కట్టించుకున్న కంపెనీ ప్రతినిధి ఈ పంటకోత ప్రయోగాలను పరిశీలించాలి. వచ్చిన దిగుబడుల వివరాలు ప్రత్యేకయాప్‌లో నమోదు చేయాలి. ఈ ప్రయోగాలతో ఈ ఏడాది ఎంతమేర దిగుబడులు పెరిగాయి? తగ్గాయి? అనే అంశంపై నిర్ధారణకు వస్తారు. ప్రయోగాల్లో వచ్చిన దిగుబడుల్లోని నివేదికల ఆధారంగా పంటనష్టపోయిన రైతులకు పంటబీమాను ఇచ్చేందుకు ప్రామాణికమవుతుంది.

ఐదేళ్లలో పంట దిగుబడులు ఇలా...

ఐదు మీటర్ల వెడల్పు, ఐదుమీటర్ల పొడవులో పంటకోత ప్రయోగాలు చేస్తే వచ్చిన దిగుబడులు ఈ విధంగా నమోదయ్యాయి. 2017-18లో 10.500 కిలోలు, 2018-19లో 17.183 కిలోలు, 2019-20లో 16.179 కిలోలు, 2020-21లో 12.810 కిలోలు, 2021- 22లో 14.462 కిలోలు, 2022-23లో 16.635 కిలోల చొప్పున ధాన్యం దిగుబడులు నమోదయ్యాయి. ఈ ఏడాది ఎకరానికి 32 నుంచి 35 బస్తాల దిగుబడి వచ్చినట్టు నమోదైంది. ఈ ఏడాది కోతకు సిద్ధంగా ఉన్న దశలో తుఫాను కారణంగా కురిసిన భారీవర్షాలకు వరిపంట నేలవాలిపోయింది. పంట నీటిలోనే వారంరోజులకుపైగా ఉండిపోయి కంకులు మొలకెత్తాయి.

రంగుమారిన, మొలకెత్తిన ధాన్యం కూడా దిగుబడిలో చూపి..

పంటకోత ప్రయోగాలు చేసిన సమయంలో మొలకెత్తిన, రంగుమారిన గింజలను సైతం దిగుబడిగానే లెక్కించారు. మొలకెత్తిన ధాన్యాన్ని రైతులు విక్రయించేందుకు ప్రయత్నించినా ఎవ్వరూ కొనుగోలు చేయరు. పంటకోత ప్రయోగాలు చేసిన అధికారులు వచ్చిన దిగుబడిని చూపి, ధాన్యం మొలకెత్తిందని, రంగు మారిందని నమోదుచేశారు. ధాన్యం మొలకెత్తిందని, రంగుమారిందనే ఈ రెండు అంశాలను పరిగణనలోకి తీసుకుని బజాజ్ బీమా కంపెనీ రైతులకు పంటబీమాను ఎంతమేర అందిస్తుందనేది ప్రశార్థకంగా మారింది.

జిల్లాలో పంటనష్టం అంచనాలు ఇలా

మిచౌంగ్ తుఫాను కారణంగా 33 శాతంకన్నా అధికంగా దెబ్బతిన్న వరి, ఇతర పంటల వివరాలను వ్యవసాయ, రెవెన్యూశాఖల బృందాలు తయారుచేశారు. ప్రాథమిక అంచనాల ప్రకారం 83,462 హెక్టార్లలో వరి పంట, వేరుశెనగ 885 హెక్టార్లలో, మొక్కజొన్న 220 హెక్టార్లలో, 315 హెక్టార్లలో మినుము, 177 హెక్టార్లలో పత్తి దెబ్బతిన్నట్టుగా చూపి ప్రాథమిక అంచనాల జాబితాను తయారుచేశారు. వరి, వేరుశెనగ, పత్తిపంట లకు హెక్టారుకు పంట నష్టపరిహారంగా రూ.17వేలు, మొక్కజొన్నకు రూ.12వేలు, మినుముకు రూ.10వేలు చొప్పున పంట నష్టపరిహారంగా ఇవ్వాలి. వరి, పత్తి, మొక్కజొన్న తదితర అన్ని పంటలకు కలిపి జిల్లాలో రూ.141.56 కోట్లను, ఉద్యాన పంటలు 493.34 హెక్టార్లలో పంటనష్టం జరగ్గా రూ.1.20 కోట్లను పంటనష్టం పరిహారంగా అందించాల్సి ఉందని నివేదిక రూపొందించారు. కలెక్టర్, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు రైతులు పంటనష్టపోయిన విధానంపై వాస్తవ పరిస్థితులను వివరించి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తేనే రైతులకు పంటబీమా వచ్చే అవకాశం ఉంటుంది.

మరోసారి నోరుజారిన నాని!

సొంత పార్టీ దళిత నేతపై తిట్లు

దేవదత్... పూజకు పనికిరాని పువ్వు

ఆయనకు ఎస్సీ నాయకులంటే చులకన : దేవదత్


పార్టీ కార్యాలయంలో కింద కూర్చున్న చిన్ని నిరసన

(విజయవాడ - ఆంధ్రజ్యోతి/తిరువూరు) : విజయవాడ ఎంపీ కేశినేని నాని మరోసారి నోరుజారారు. సొంత పార్టీ దళిత నేతపైనే తిట్లతో విరుచుకుపడ్డారు. 7న చంద్రబాబు బహిరంగ సభను పురస్కరించుకుని బుధవారం తిరువూరులో పార్టీ జిల్లా నేతలు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొనేందుకు ఎంపీ కేశినేని నాని, ఆయన సోదరుడు కేశినేని చిన్ని వచ్చారు. వేదికపై ఏర్పాటు చేసిన బ్యానర్‌లో నాని ఫొటో లేదంటూ ఆయన వర్గం తొలుత ఆందోళనకు దిగింది. చిన్నిని కార్యాలయంలోకి రాకుండా అడ్డుకున్నారు.

ఏదో వ్యాపారానికి వచ్చాడు : నాని

ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తిరువూరులో పార్టీ వీక్‌గా ఉండటంతో దేవదత్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారని అన్నారు. కానీ ఇన్‌చార్జి పూజకు పనికిరాని పూవులాంటి వాడన్నారు. ఇలాంటి పువ్వుతో పూజ చేస్తే ఫలితం ఉండదన్నారు. 'అతను రాజకీయాలకు పనికిరాడు, ఏదో వ్యాపారం చేసుకునేందుకు ఇక్కడకు వచ్చాడు. బలహీన క్షణంలో ఎవ్వరినో పట్టుకొని ఇన్‌చార్జి తెచ్చుకున్నాడు' అని వ్యాఖ్యానించారు.

ఎస్సీ నాయకుడినని చిన్నచూపు : దేవదత్

తిరువూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి శావల దేవదత్ స్పందిస్తూ.. తన పట్ల కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని, ఎస్సీ నాయకుడిననే చిన్నచూపుతో వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తా : చిన్ని

టీడీపీ నాయకుడు కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ.. నియోజకవర్గం ప్రజలకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు క్షమాపణ చెబుతున్నానన్నారు. కార్యాలయంలో జరిగిన సంఘటనను అధిష్ఠానం దృష్టికి తీసుకెళతానని తెలిపారు.



ఆధ్యాత్మిక విధానం ఫాలూన్ దఫా

» ఇన్‌స్ట్రక్టర్ సుబ్రహ్మణ్యం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ సిటీలైఫ్)

సత్యం, దయ, సహనం... ఈ మూడు మానవుడిలో కొలువై ఉండాలని ఆధ్మాత్మికవేత్తలు చెబుతారు. అన్ని మతాల గురువులు, పీఠాధిపతులు ఇదే విషయాన్ని ప్రవచనాల్లో స్పష్టం చేస్తారు. ఈ మూడింటికి ఒక్కో మతంలో ఒక్కో నామకరణం ఉంటుంది. మతంతో సంబంధం లేకుండా మరో ఆధ్మాత్మిక విధానాన్ని పరిచయం చేస్తున్నారు హైదరాబాద్‌కు చెందిన సుబ్రహ్మణ్యం. ఫాలూన్ దఫా అనే చైనా ఆధ్మాత్మిక విధానంలో ఒక మనిషి తనను తాను ఎలా సంస్కరించుకోవచ్చో వివరిస్తున్నారు. పుస్తక మహోత్సవంలో స్టాల్ నంబర్ 47లో ఫాలూన్ దఫా ప్రదర్శనను ఏర్పాటు చేశారు. "1992లో చైనాకు చెందిన లీ హోంగ్ జీ ఈ ఫాలూన్ దఫాను పరిచయం చేశారు. సత్యం, దయ, సహనం ఈ మూడు దీని ప్రధాన సూత్రాలు. ఇదొక ఆధ్మాత్మిక సాధన. నేను 2007లో న్యూజిల్యాండ్‌కు వెళ్లాను. ఒక రోజున వాకింగ్ చేస్తుండగా పార్కులో రమణీయమైన సంగీతం మధ్య కొంతమంది ఫాలూన్ దఫా ధ్యానం చేయడం కనిపించింది. అప్పుడే దానికి ఆకర్షితుడునయ్యా. నేను ఆ ధ్యాన విధానాలను నేర్చుకుని కార్పొరేట్ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాను" అని సుబ్రహ్మణ్యం చెప్పారు. లీ హోంగ్ జీ చేసిన తొమ్మిది ప్రసంగాలు జువన్ ఫాలూన్ పుస్తకాన్ని తెలుగులోకి అనువదించి, అందుబాటులోకి తీసుకొచ్చారు.


భాగవత కథామృతం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణకుమారి తదితరులు

భక్తికి అక్షరరూపం.. పోతన భాగవతం

విజయవాడ కల్చరల్, జనవరి 3 : భక్తికి అక్షరరూపం పోతన భాగవతమని, తెలుగు వారి నిత్యజీవితంలో పోతన భాగవతం విడదీయరాని భాగంగా ఉండేదని ఆకాశవాణి పూర్వ సంచాలకురాలు ముంజులూరి కృష్ణకుమారి అన్నారు. 34వ విజయవాడ పుస్తక మహోత్సవం ఏడోరోజు బుధవారం కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై నిర్వహించిన సభలో డాక్టర్ జంధ్యాల పరదేశి బాబు రచించిన 'భాగవత కథామృతం' పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. నేటితరం భాగవతంలోని ముఖ్య ఘట్టాలను అర్థం చేసుకొనేందుకు ఈ పుస్తకం ఉపయోగపడుతుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన పోలవరం కోటేశ్వరరావు సాహితీ సమితి సంస్థ అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ, బమ్మెర పోతన రచించిన భాగవతంలోని కొన్ని కథల్ని తీసుకొని వాటి సారాన్ని పాఠకులకు రచయిత పరదేశిబాబు సమర్థవంతంగా అందించారన్నారు. డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ, వ్యాస సంపుటిని పునాదిగా చేసుకొని ప్రహ్లాద చరిత్ర, గజేంద్ర మోక్షం, మొదలైన శీర్షికలతో వ్యాసాల్ని రచించి రుక్మిణీ కళ్యాణంతో ముగించారు. నవవిధ భక్తిబావాలతో నిండిన మహాభాగవతలను నవ ఘట్టాలను సేకరించి వ్యాస రూపంలో భాగవతామృతాన్ని పంచిన సాహిత్య విశ్లేషకుడు డాక్టర్ పరదేశి అన్నారు. రచయిత్రి డాక్టర్ కావూరి సత్యవతి మాట్లాడుతూ, మట్టినీ బంగారాన్ని సమదృష్టితో చూసిన రాజర్షి అంబరీష్‌ని కథను ఒక వ్యాసంలో రసరమ్యంగా వివరించి భక్తి సర్వాధిక్యమని రాజభోగాల కంటే అత్యుత్తమమైనదని నిరూపించారన్నారు. భాగవత విశిష్టతను, రచయిత రచనాశైలిని ప్రశంసించారు. కార్యక్రమంలో బాలాంత్రపు ప్రసూన పాల్గొన్నారు.

పిల్లలకు చదివే సమయమివ్వాలి

» రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు కావూరి సత్యవతి



పుస్తక పఠనం, తెలుగు భాషపై బాల్యం నుంచి పిల్లలకు ఆసక్తిని పెంపొందించాలి. పిల్లలను హోంవర్కులు, ప్రాజెక్టు వర్కులతో బిజీ చేయడం కాదు, వారికి పుస్తకాలను చదివే సమయాన్ని ఇవ్వాలి. తల్లిదండ్రులు ఈ విషయంలో శ్రద్ధ తీసుకోవాలి అంటున్నారు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు కావూరి సత్యవతి. ఉద్యోగంలో ఉన్నప్పుడు ఉపాధ్యాయురాలిగా, ఉద్యోగ విరమణతో సాహిత్యకారిణిగా ఉన్న సత్యవతి పుస్తక మహోత్సవంలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

"విహారి రచించిన శ్రీపద చిత్ర రామాయణంలోని బాలకాండపై డాక్టర్ గుమ్మా సాంబశివరావు పర్యవేక్షణలో పీహెచ్‌డీ చేశాను. ప్రస్తుతం పిల్లలను హోంవర్కులు, ప్రాజెక్టు వర్కులు అని చెప్పిక్షణం తీరిక లేకుండా చేస్తున్నారు. పిల్లలతో పుస్తకాలు చదివించాలన్న ఆసక్తి తల్లిదండ్రుల్లోనూ కనిపించడం లేదు. ఎవరైనా



మాతృభాషలో చదవాలనుకుంటారు. ఆ పరిస్థితి ఇప్పుడు ఉందా? ఇంగ్లీష్‌లో నాలుగు మాటలు మాట్లాడితే అదేదో గొప్ప అనుకునే పరిస్థితి తల్లిదండ్రుల్లో కనిపిస్తోంది. మా చిన్నతనంలో గొబ్బిపాటలు పాడేవాళ్లం. అన్నమాచార్య, త్యాగరాయ కీర్తనలు విన్నాం. వాటి గురించి పెద్దయ్యాక అవగాహన చేసుకున్నాం. చిన్నతనంలో వింటే పెద్దాయ్యాక వాటి గురించి ఆలోచిస్తాం. పుస్తకాల ద్వారా జ్ఞానం, విజ్ఞానం పెరుగతాయి. ఇప్పుడు ఈ రెండింటికి అర్థం మారిపోయింది. పిల్లలు సినిమా బాగా చూస్తే విజ్ఞానం అనుకుంటున్నారు. డ్యాన్స్‌ల వేసి, వీడియో గేమ్‌లు ఆడితే పరిజ్ఞానం అనుకునే పరిస్థితి ఉంది. ఈ సంప్రదాయం మారాలి. అందుకే బాల్యం నుంచి సాహిత్యం, సంప్రదాయాలు, ప్రకృతిపై అవగాహన కల్పించడానికి సాహితీ రూపకాలు ప్రదర్శిస్తున్నాం. నేను, నా స్నేహితులు కలిసి వివిధ విద్యాసంస్థల్లో ఈ రూపకాలు ప్రదర్శిస్తున్నాం. కాలాలు, రుతువులు, ఆయా రుతువుల్లో పూచే పూల గురించి విశదీకరణంగా చెబుతాం.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ సిటీలైఫ్)

సావిత్రీబాయి స్ఫూర్తి అజరామరం


కత్తి పద్మారావు రచనలను ఆవిష్కరిస్తున్న వక్తలు

విజయవాడ కల్చరల్, జనవరి 3 : భారత జాతీయ స్త్రీవాద ఉద్యమంపై సావిత్రీబాయి పూలే స్ఫూర్తి అజరామరమని స్త్రీవాద కార్యకర్త బీఎం లీలాకుమారి అన్నారు. సావిత్రిబాయి పూలే 193వ జయంతి సందర్భంగా లోకాయుక్త పబ్లికేషన్స్ బుధవారం కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై నిర్వహించిన సభలో కత్తి పద్మారావు రచించిన 'పితృస్వామ్య భారతంలో స్త్రీ', 'ఈ దేశం మాది', 'వ్యక్తిత్వ నిర్మాణం-6' పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్త్రీ అభ్యున్నతికి విద్య యొక్క అవసరాన్ని గుర్తించి, స్త్రీ విద్య కోసం ఎన్నో అవమానాలు, ప్రమాదాలు ఎదుర్కొని కూడా తమ ఆశయసాధన కోసం కృషి చేశారని వివరించారు. స్త్రీల అభ్యున్నతి కేవలం స్త్రీల చేతుల్లోనే లేదని, దీనికి మహిళా శక్తిని గుర్తించి ప్రోత్సహించిన పూలే, అంబేడ్కర్ లాంటి పురుషుల అవసరం కూడా వుందని ఆమె చెప్పారు. ప్రసంగ ప్రజ్ఞానిధి డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ, కత్తి పద్మారావు తన కవిత్వానికి ఊపిరి దళిత స్త్రీ అని, మధ్యలో తన కవిత్వానికి తత్వభూమిక అంబేడ్కర్ వాదం, తన కవిత్వ సిద్ధాంతం కుల నిర్మూలనని పేర్కొన్నారు. ఇంటిపేరులో కత్తి, ఒంటి పేరులో పద్మం కలిగి ఈ రెండింటికి వైరుధ్యం కలిగిన ఆయన పద్మావలాంటి మనస్సుతో ఆలోచన చేసి కత్తిలాంటి కవిత్వాన్ని సృజన చేసి అసమానతలు కులవాదాన్ని ఖండిస్తూ వస్తున్నారన్నారు. చింతపల్లి గురుప్రసాద్ మాట్లాడుతూ, ఆధునిక ప్రపంచంలో కూడా స్త్రీకి అవమానాలు తప్పకపోవడం దురదృష్టకరమన్నారు. స్త్రీలను గౌరవించడం ద్వారా మనం నాగరికులమని నిరూపించుకోవాలని సూచించారు. అదే సావిత్రబాయి పూలేకి నిజమైన నివాళి అని అభిప్రాయపడ్డారు. గడ్డం విజయారావు సభకు అధ్యక్షత వహించారు. గోళ్ల నారాయణరావు, శిఖా ఆకాష్, గార్ల రమేష్ సభలో పాల్గొన్నారు. రంగం రాజేష్ బృందం ఉద్యమ గీతాలను ఆలపించారు.


పిల్లల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కె.లక్ష్మయ్య తదితరులు

పుస్తకాలకు దగ్గర చేయాలి

విజయవాడ కల్చరల్, జనవరి 3 : పిల్లల్ని పుస్తకాలకు మరింత దగ్గర చేసే విధంగా బాలసాహిత్య రంగంలో నేషనల్ బుక్ ట్రస్ట్ చేస్తున్న కృషి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు, ప్రశంసలు పొందాయని పుస్తక మహోత్సవ సంఘం కార్యదర్శి కె.లక్ష్మయ్య అన్నారు. దేశవ్యాప్తంగా సంచార గ్రంథాలయాలు, పుస్తక మహోత్సవాలు, ప్రదర్శనలు నేషనల్ బుక్ ట్రస్ట్ ప్రారంభించిందని వివరించారు. పిల్లలతో పుస్తకాలు చదివించడం, రాయించడం, అవసరమైన పుస్తకాలు ప్రచురించడంలో సంస్థ పాత్ర చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా అధ్వర్యంలో పిల్లల పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహించారు. 'చికా చిక్ చిక్', 'నా ఫుట్‌బాల్', 'ఛుట్కీ', 'భీంసేన్‌జోషి', 'గోవా', 'నీలు-పీలు' పిల్లల పుస్తకాలను ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు ముంజులూరి కృష్ణకుమారి, పుస్తక మహోత్సవ సంఘం కార్యదర్శి కె.లక్ష్మయ్య, ఇంద్రాణి, డాక్టర్ మురహరిరావు, ఉమాగాంధి, రావెళ్ల శ్రీనివాసరావులు ఆవిష్కరించారు. ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు ముంజులూరి కృష్ణకుమారి మాట్లాడుతూ పిల్లలకు పుస్తకాలపై ఆసక్తి కలిగించాల్సిన బాధ్యత పెద్దలదేనన్నారు. ఆ దిశగా నేషనల్ బుక్ ట్రస్ట్ చేస్తున్న కృషిని అభినందించారు. పాఠశాల విద్యార్థినులు చైతన్య, రాజ్యలక్ష్మి, జ్ఞానప్రసూన పుస్తకాలను సభకు పరిచయం చేశారు. నేషనల్ బుక్ ట్రస్ట్ బాధ్యులు పత్తిపాక మోహన్ సభను నిర్వహించారు. పిల్లలకు పుస్తకాలతో, సాహిత్యంతో అనుబంధం పెంచితే అది విద్యారంగ అభివృద్ధికి, సామాజిక అభివృద్ధికి దోహదం చేస్తుందని విద్యావేత్త ఇంద్రాణి అన్నారు. పిల్లలకు పుస్తకాలను చదవడం అలవాటు చేస్తే వారు అనేక విజయాలను సాధించగలరని రావెళ్ల శ్రీనివాసరావు అన్నారు. ఉమాగాంధీ మాట్లాడుతూ మంచి కథల ద్వారా పిల్లల్లోని అద్భుతమైన భావ వ్యక్తీకరణాశక్తిని వెలికి తీయవచ్చన్నారు.


విశాలాంధ్ర ప్రచురణలను ఆవిష్కరిస్తున్న ఎంవీఎస్ శర్మ తదితరులు

నేడు సా.4 గంటలకు అనగనగా ఒక కథ

భగవద్గీత-ఒక అవలోకన పుస్తకావిష్కరణ

విజయవాడ కల్చరల్, జనవరి 3 : భగవద్గీత భారతీయ సంస్కృతిలోని వివిధ మత భావనలను క్రోడీకరించిన గ్రంథమని శాసనమండలి మాజీ సభ్యుడు, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎంవీఎస్ శర్మ అన్నారు. బుధవారం కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై విశాలాంధ్ర వారి పుస్తకావిష్కరణ సభను నిర్వహించారు. 'భగవద్గీత-ఒక అవలోకన' గ్రంథాన్ని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భగవద్గీతను భగవంతుని వాక్కుగా కాకుండా ఒక చారిత్రక ఆధారంగా పరిశీలించాలని సూచించారు. సనాతనధర్మం భగవద్గీత ఒకటే బోధించాయనే విషయం పూర్తిగా నిజం కాదన్నారు. భూస్వామ్య వ్యవస్థ మొదలైన తొలినాళ్లలో అప్పటికి అమలులో వున్న గణతంత్ర, సమిష్టి బావనలకు వ్యతిరేకంగా, భూస్వామ్య వ్యవస్థలను బలపరిచేందుకు భగవద్గీత అవసరమైందన్నారు. మారుతున్న కాలంతో పాటు, ధర్మాలు కూడా మారుతుంటాయి కనుక భగవద్గీతను అదే దృష్టితో చూడాలన్నారు. ప్రస్తుతం ఒక మతం ప్రయోజనం కోసం, రాజకీయ ప్రయోజనాల కోసం భగవద్గీతను ప్రజల వద్దకు తీసుకువెళ్లేందుకు విపరీతమైన ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. భగవద్గీత పేరుతో సమాజంలోని అసమానతలను దేవుడే సృష్టించాడని చెప్పడం అన్యాయమన్నారు. అలాగే పనిమీదే కానీ ఫలితం మీద ఆశలు వదులుకోవాలని చెప్పడం కూడా తగదన్నారు. 'అరుణ తారలు' పుస్తకాన్ని ప్రజానాట్య మండలి గౌరవ సలహాదారు నల్లూరు వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, ప్రజలను చైతన్యవంతం చేసే సాహిత్యాన్ని సుదీర్ఘకాలంగా తెలుగువాళ్లకు అందిస్తున్న విశాలాంధ్ర సంస్థను అభినందించారు. సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజల కోసం తమ సర్వస్వం అర్పించిన కమ్యూనిస్టు నాయకుల చరిత్రలను అరుణతారలు పుస్తకరూపంలో ప్రజలకు అందించడం ముదావహమన్నారు. 'పెరియార్ ఈవీ రామస్వామి నాయకర్ రాజకీయ జీవితం' పుస్తకాన్ని విశాలాంధ్ర విజ్ఞాన సమితి కోశాధికారి జి.ఓబులేశు ఆవిష్కరించారు. అభ్యుదయవాదాన్ని జీవితంలో ఆచరించిన పెరియార్ రామస్వామి గొప్ప సాంఘిక సంస్కర్తగా చరిత్రలో నిలిచిపోతారని ఆయన చెప్పారు. ఇదేసభలో డాక్టర్ రెంటాల శ్రీనివాసరావు అనువదించిన 'భారతీయ నాస్తికవాదం' పుస్తకాన్ని విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ పి.హరినాథరెడ్డి ఆవిష్కరించారు. సమితి సంపాదకులు గడ్డం కోటేశ్వరరావు సభకు అధ్యక్షత వహించారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ మనోహరనాయుడు పాల్గొన్నారు.

వేదిక వద్ద వాగ్వాదం..

ఎంవీఎస్ శర్మ భగవద్గీతపై మాట్లాడుతున్నపుడు కేతు విశ్వనాథరెడ్డి వేదిక ఆవరణలో వున్న ఇద్దరు హిందూ వాదులు వాగ్వాదానికి దిగారు. భగవద్గీతను విమర్శించడానికి లేదని భగవద్గీతలో అసహనం ఉందని వ్యాఖ్యానించడం సరికాదన్నారు.




జీలగలగండి కాలనీ వద్ద అంగన్వాడీ కార్యకర్తను అంబులెన్స్‌లో తరలిస్తున్న పోలీసులు

చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద సొమ్మసిల్లిన అంగన్వాడీ కార్యకర్త

విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న సుజాత

అంగన్వాడీల ఉద్యమం ఉధృతం

» ఎక్కడికక్కడ అడ్డుకున్న పోలీసులు » సొమ్మసిల్లిన కార్యకర్తలు

» ప్రభుత్వ కక్షసాధింపు చర్యలపై ఆగ్రహం



ఎ.కొండూరు, జనవరి 3 : వేతనాలు పెంచాలని సమ్మె చేస్తున్న అంగన్వాడీల సమ్మె బుధవారం తీవ్రరూపం దాల్చింది. తమ డిమాండ్‌ల సాధన కోసం పోలీసుల ఆంక్షలను దాటుకుని కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి సిద్ధమయ్యారు. కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళుతుండగా అంగన్వాడీ సిబ్బందికి, పోలీసులకు తోపులాట జరగ్గా ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన కార్యకర్త కాకర్ల సుజాత స్పృహ కోల్పోయింది. తోటి సిబ్బంది ఆమెను విజయవాడ జీజీహెచ్‌కు తరలించారు.

ఘంటసాల : మచిలీపట్నంలో నిరసన కార్యక్రమానికి బయలుదేరిన అంగన్వాడీలను ఘంటసాల మండల పరిధిలోని జీలగలగండి కాలనీ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తరలిస్తుండగా, అవనిగడ్డ 9వ వార్డుకు చెందిన కార్యకర్త జి.భవాని సొమ్మసిల్లి పడిపోయింది. పోలీసులు హుటాహుటిన చల్లపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. న్యాయమైన కోర్కెల కోసం శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళుతున్న తమపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు దారుణమన్నారు.

జగ్గయ్యపేట రూరల్ : కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో భాగంగా విజయవాడ బయల్దేరిన అంగన్వాడీలను చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆందోళనకారులను చిల్లకల్లు పాలశీతలీకరణ కేంద్రం కళ్యాణ మండపానికి తరలిస్తుండగా జగ్గయ్యపేటకు చెందిన హసీనా సొమ్మసిల్లి పడిపోవడంతో ఎస్ఐ కృష్ణబాబు జీపులో ఆమెను ఆస్పత్రికి తరలించారు.


అవనిగడ్డలో ధర్నా చేస్తున్న డీఎస్సీ ఆశావహులు

అవనిగడ్డలో డీఎస్సీ ఆశావహుల ధర్నా

అవనిగడ్డ, జనవరి 3 : మెగా డీఎస్సీ వేస్తామని వైసీపీ ప్రభుత్వం తమను మోసగించిందని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చి శిక్షణ పొందుతున్న డీఎస్సీ ఆశావహులు అవనిగడ్డలో ధర్నా నిర్వహించారు. మెగా డీఎస్సీ కోసం ఆశావహులు చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని ప్రభుత్వం భగ్నం చేయటమే కాకుండా పలువురిని అరెస్టు చేయటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకుండా ఇన్నేళ్లు తాత్సారం చేయటంతో తాము నేటికీ తల్లిదండ్రులపైనే ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ వేసి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని ప్రతిపక్ష నేతగా జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని, నేడు తమ గురించి పట్టించుకోకుండా వదిలేశారని ఆశావహులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజీవ్‌గాంధీ సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ధర్నా కార్యక్రమానికి టీడీపీ, జనసేన పార్టీలు మద్దతు తెలిపాయి.

పెంచిన సామాజిక పింఛన్ల పంపిణీ

» కృష్ణాజిల్లాలో 245783 మందికి 72.52 కోట్లు

» ఈ ఏడాది 3913 కొత్తవి మంజూరు : కలెక్టర్ రాజాబాబు

మచిలీపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 245783 మందికి నెలకు రూ.3వేల చొప్పున సామాజిక పింఛన్లు అందిస్తున్నట్టు కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కాకినా



డలో వైఎస్సార్ పింఛను కానుక రూ.3వేల పెంపుదల కార్యక్రమంలో బుధవారం పాల్గొన్నారు. కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్‌హాలు నుంచి కలెక్టర్, అధికారులు కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సామాజిక పింఛన్ల రూపంలో జిల్లాలో 2.45లక్షల మందికి నెలకు రూ.72.52కోట్లను అందిస్తున్నట్టు తెలిపారు. 2019 నుంచి ఇప్పటివరకు జిల్లాలో 89867మందికి నూతనంగా పింఛన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది 3,913మందికి నూతనంగా పింఛన్లు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పేర్ని కిట్టు, మచిలీపట్నం మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో 202720 మందికి లబ్ధి

» 3173 కొత్తవి మంజూరు : కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వైఎస్సార్ పెన్షన్ కానుకగా పింఛన్ రూ.3 వేలకు పెంచి ఇచ్చే కార్యక్రమానికి వర్చువల్‌గా కలెక్టరేట్ వీసీ



హాల్ నుంచి ఎన్టీఆర్ కలెక్టర్ ఢిల్లీరావు, అధికారులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరక్టర్లు తదితరులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు, అధికారులతో కలిసి లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వైఎస్సార్ పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచి, లబ్ధిదారులకు అందించే కార్యక్రమం జనవరి 1 నుంచి 8వ తేదీ వరకు జరుగుతోందన్నారు. 2023, డిసెంబరులో ఎన్టీఆర్ జిల్లాలో 236041 మందికి రూ.65.54 కోట్లు అందించడం జరిగిందని, జనవరి 1 నుంచి వృద్ధాప్య, వితంతు, నేత, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు తదితర ఏడు కేటగిరీలకు చెందిన 2,02,720 మందికి రూ.3 వేలకు పెంపు వర్తిస్తుందని వివరించారు.


నోడల్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

ఎన్నికలకు సంసిద్ధం కావాలి

» నోడల్ అధికారులతో కృష్ణా కలెక్టర్ సమీక్ష

మచిలీపట్నం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో నోడల్ అధికారులు ఎన్నికలకు సంసిద్ధులు కావాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు నియమించబడిన 16మంది సీనియర్ అధికారులతో బుధవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణపై త్వరలో నోడల్ అధికారులకు శిక్షణ కూడా ఇస్తామన్నారు. నోడల్ అధికారులు జిల్లాలో శాంతిభద్రతలను పర్యవేక్షించాలని, ఓటర్లను చైతన్యవంతం చేసే కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఓటర్ల జాబితాలను సవరించే ప్రక్రియపైనా దృష్టి సారించాలన్నారు. రాజకీయపార్టీల ఏజెంట్లకు పోలింగ్‌పై శిక్షణ ఇవ్వడంలో ఎన్నికలసంఘం సూచనలను పాటించాలన్నారు. పోలింగ్‌కు అవసరమైన సామగ్రిని సమకూర్చడంపై ఇప్పటినుంచే కసరత్తు చేయాలన్నారు. కోడ్ అమలుకు సంబంధించిన మార్గదర్శకాలపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలన్నారు. మీడియాలో పెయిడ్ ఆర్టికల్స్‌పై దృష్టి సారించి, అభ్యర్థుల ఎన్నికల ఖర్చులో ఈ వివరాలు నమోదుచేసేలా మీడియా కేంద్రంను తెరుస్తామన్నారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందించాలన్నారు. సమావేశంలో జేసీ అపరాజిత సింగ్, డీఆర్వో పి.రోజా, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

జగన్‌ను గద్దె దించేందుకు జనం సిద్ధం

» వెనిగండ్ల, రావి, కొనకళ్ల

గుడ్లవల్లేరు, జనవరి 3 : ప్రజల్లో చైతన్యం వచ్చింది.. జగన్ పాలనపై విసిగిపోయి ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారు. మూడునెల్లల్లో జగన్‌ను గద్దె దించడం ఖాయం.. అని గుడివాడ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం బాబు ష్యూరిటీ, భవిషత్ గ్యారంటీ కార్యక్రమం చంద్రాల గ్రామంలో ఆయన ప్రారంభించారు. ఇంటింటికీ తిరిగి పార్టీ మినీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వెనిగండ్ల రాము మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిని



ఓడించేందుకు ప్రజలు సిద్ధమయ్యారన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు రూపొందించిన ఉమ్మడి మ్యానిఫెస్టో ప్రజలకు ఎంతో మేలు చేసే విధంగా ఉందని ఆయన అన్నారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు.

సైకోలను తరిమి కొడదాం.. : రావి

నియోజకవర్గంలో ఒకరు, రాష్ట్రంలో మరొకరు ఇద్దరు సైకోలను తరిమి కొడదామని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. టీడీపీ మ్యేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ కార్యక్రమాలను ఇంటింటికి తిరిగి వివరిస్తున్నట్టు రావి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కొడాలి రామరాజు, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు తూము పద్మజ, రాష్ట్ర కార్యదర్శి శాయిన పుష్పావతి, జనసేన నేతలు తదితరులు పాల్గొన్నారు.


కారులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు, పట్టుబడిన నగదు

పత్రాలు లేని రూ.47.41లక్షలు స్వాధీనం


గుడివాడ : జిల్లా ఎస్పీ జాషువా ఆదేశాల మేరకు గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్ సారథ్యంలో టూటౌన్ పోలీసులు బుధవారం స్థానిక పెదఎరుకపాడు దిబ్బ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో భారీగా నగదును పట్టుకున్నారు. కారులో ఎటువంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.47.41లక్షల నగదును గుర్తించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్‌కు అప్పగించినట్టు టూటౌన్ సీఐ బి.తులసీధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎవరైనా నగదు లావాదేవీలు భారీ మొత్తంలో తరలించే సమయంలో నగదుకు సంబంధించి సరైన పత్రాలను దగ్గర పెట్టుకోవాలని సూచించారు.

చీటీల పేరుతో మోసగించిన వ్యక్తి అరెస్టు

పామర్రు : పట్టణంలో చీటీల పేరుతో పలువురిని మోసగించిన వ్యక్తిని పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలోని సాయిదుర్గా కాలనీకి చెందిన చీరల వ్యాపారి తలశిల గంగాధర్ రామ్మోహన్(34) చీటీల పేరుతో రూ3కోట్లమేర కుచ్చుటోపి పెట్టి పరారైన ఘటన తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ శుభాకర్ సిబ్బందితో కలిసి ప్రధాన నిందితుడైన రామ్మోహన్‌ను స్థానిక బైపాస్ రోడ్డులో అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రూ. 5వేలు, నాలుగుకేజీల వెండి వస్తువులు స్వాధీనం చేసుకుని గుడివాడ కోర్టులో హాజరుపరిచినట్టు పోలీసులు తెలిపారు.

ధర్నా విజయవంతం చేయండి

» యూటీఎఫ్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కనకారావు


మాట్లాడుతున్న కనకారావు

మచిలీపట్నం టౌన్, జనవరి 3 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి విజయవాడలో ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్న 36 గంటల ధర్నాను విజయవంతం చేయాలని యూటీఎఫ్ కృష్ణాజిల్లా శాఖ అధ్యక్షుడు బి.కనకారావు పిలుపునిచ్చారు. బుధవారం మచిలీపట్నం ధర్నాచౌక్‌లో జరిగిన ధర్నా కార్యక్రమానికి కనకారావు అధ్యక్షత వహించి ప్రసంగించారు. పీఆర్సీ, డీఏ, పీఎఫ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో తాత్సారం చేస్తోందన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్‌పి మనోహర్ ప్రారంభించిన ధర్నా శిబిరంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జె.లెనిన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బీసీలు సంఘటితం కావాలి : కొనకళ్ల

మచిలీపట్నం టౌన్ : రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు సంఘటితమై జగన్‌రెడ్డిని గద్దె దింపాలని, మంగళగిరి సెంట్రల్ కార్యాలయం వద్ద గురువారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎంపీ, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ పిలుపునిచ్చారు. బుధవారం మచిలీపట్నంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో బీసీలు దగా పడ్డారన్నారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను పెద్ద సంఖ్యలో జగన్‌రెడ్డి తగ్గించారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక బీసీల అభ్యున్నతికి ప్రత్యేక చట్టం తెస్తామని మేనిఫెస్టోలో చెప్పారని, దీనికోసం బీసీలు పార్టీకి వెన్నుదన్నుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ళ జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	97, 105, 116
చికెన్ విత్ స్కిన్	186
చికెన్ స్కిన్‌లెస్	196

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.85

రామమందిరం ప్రాణప్రతిష్ఠపై ఇంటింటికీ ఆధ్యాత్మిక ప్రచారం



మాజీ సర్పంచ్ అరుణకు ఆహ్వానపత్రిక ను అందిస్తున్న ముముక్షు ప్రతినిధులు

హనుమాన్‌జంక్షన్, జనవరి 3 : అయోధ్యలోని శ్రీరామమందిరం ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని బుధవారం హనుమాన్ జంక్షన్‌లో ముముక్షు భజన సమాజం ప్రతినిధులు ఆహ్వానపత్రికలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ నెల 22న అయోధ్యలో నిర్వహించనున్న శ్రీరామ మందిరం ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని ఆధ్యాత్మిక అమృత వాహిని కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ఆహ్వానపత్రికతో పాటు అక్షింతలు అందజేశారు. ప్రతిష్ఠ కార్యక్రమం జయప్రదం చేయాలని పచారం నిర్వహించారు.

వేలేరు నవోదయ వార్షికోత్సవానికి
కలెక్టర్‌కు ఆహ్వానం



కలెక్టర్ రాజాబాబుకు నవోదయ ఉపాధ్యాయుడు గీసిన చిత్రాన్ని బహుకరిస్తున్న ప్రిన్సిపాల్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 3 : జవహర్ నవోదయ విద్యాలయ వార్షికోత్సవానికి విచ్చేయాలని కోరుతూ కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబును ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఆహ్వానించారు. వేలేరు జవహర్ నవోదయ విద్యాలయం తరపున బందరులోని కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజాబాబును బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నవోదయ విద్యాలయంకు చెందిన డ్రాయింగ్ టీచర్ గీసిన కలెక్టర్ చిత్రపటాన్ని అందజేశారు. జనవరి 11న నిర్వహించే వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా రావాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ రాజాబాబు సానుకూలంగా స్పందించారని ప్రిన్సిపాల్ తెలిపారు.

సారా విక్రేత అరెస్టు

హనుమాన్‌జంక్షన్, జనవరి 3 : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపల్లిలో బుధవారం సారా విక్రయిస్తున్న మహిళను ఎస్సై ఏడీఎల్ జనార్దన్ అరెస్టు చేశారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బెజవాడ రామకుమారి గ్రామంలో అక్రమంగా నాటు సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో నివాసంపై దాడి చేసి ఆమె వద్ద ఉన్న 25 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి నూజివీడు కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై జనార్దన్ తెలిపారు.

మహిళా విద్యాభివృద్ధికి
సావిత్రీబాయి పూలే కృషి



సదస్సులో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి

ఉయ్యూరు, జనవరి 3 : మహిళా విద్యాభివృద్ధికి సావిత్రి బాయి పూలే ఎనలేని కృషి చేశారని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి అన్నారు. సావివిత్రిబాయి పూలే జయంతి పురస్కరించు కుని స్థానిక నాగళ్ల రాజేశ్వరమ్మ, జానకి రామయ్య విజ్ఞాన కేంద్రలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పీడిత ప్రజలు, మహిళల విద్యకు కృషిచేసిన సావిత్రిబాయి పూలే తొలి తరం మహిళా ఉద్యమకారిణి అన్నారు. సావిత్రిబాయి పూలే దంపంతుల జీవితకాలంలో 52 పాఠశాలలు ప్రారంభించి విద్యాభివృద్ధికి విశేష కృషిచేశారని గుర్తుచేశారు. కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది ప్రశాంతి, స్వర్ణకుమారి, మిరియలా ఆనంద్ బెనర్జీ తదితరులు పాల్గొని సావిత్రి బాయి పూలేకు నివాళర్పించారు.

రోడ్డు ప్రమాదంలో
వృద్ధుడికి తీవ్రగాయాలు

హనుమాన్‌జంక్షన్, జనవరి 3 : స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో బుధవారం లారీ ఢీ కొన్న ఘటనలో బాపులపాడు ఇందిరానగర్ కాలనీకి చెందిన వృద్ధుడు కంచనపల్లి వెంకట సత్యానారాయణకు తీవ్రగాయాలయ్యాయి. ఎడమ కాలు మీదుగా లారీ చక్రం దూసుకు పోవడంతో నుజ్జునుజ్జు అయ్యింది. తొలుత 108 అంబులెన్సులో ఏలూరులో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.





వైసీపీ పతనం ప్రారంభమైంది

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పోరంకిలో జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, జనవరి 3 : రాష్ట్ర వినాశకుడు, ఆధునిక నియంత జగన్‌రెడ్డి వింత పోకడలను తట్టుకోలేక, వచ్చే ఎన్నికల్లో వైసీపీ పతనం ప్రారంభమైందని గ్రహించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తనను వదిలి టీడీపీ వైపు మొగ్గు చూపడాన్ని బట్టి జగన్‌రెడ్డి పరిస్థితి ఏమిటో అర్థమవుతుందని, తన చేతకాని విధానాలతో తన పార్టీ ఎమ్మెల్యేలను నియంత్రించుకోలేని దీనస్థితిలో జగన్‌రెడ్డి ఉన్నాడని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ విమర్శించారు. బుధవారం పోరంకి 4, 5వ డివిజన్లలో జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి ప్రజలతో మాట్లాడారు. స్థానికంగా ఉన్న అన్ని వనరులను దోచేసిన వైసీపీ నాయకులు జగన్‌రెడ్డి మనస్తత్వాన్ని అర్థం చేసుకొని పక్క చూపులు చూస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బోడె వెంట అనుమోలు ప్రభాకరరావు, సంగెపు రంగారావు, బోడె సురేంద్ర, యార్ల చక్రవర్తి, ముక్కామల నాని, ముమ్మనేని గోపాలకృష్ణ, పాలడుగు సాయిబాబు, సజ్జా సుబ్బారావు, బొంగరాల అబ్రహాం పాల్గొన్నారు.

తాడిగడప పదో డివిజన్‌లో..

తాడిగడప పదో డివిజన్‌లో జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో బోడె హేమ ఆధ్వర్యంలో టీడీపీ నేతలు మేడసాని రత్నకుమారి, రేఖ, నాగమణి, కనకదుర్గ, ప్రమీ ల, తుమ్మల రాంకుమార్, పీతా గోపి, మన్నె రాజాబాబు, నాగుల్‌మీరా, మేడసాని వెంకటేశ్వరరావు, పామర్తి సిద్దయ్య, కిలారు రవివర్మ, మొక్కపాటి దామోదర్, కందుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యనమలకుదురులో..

యనమలకుదురు 15వ డివిజన్, వివిధ బూత్‌లలో జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాల్లో అనంతనేని చంద్రశేఖరాజాద్, మొక్కపాటి శ్రీనివాస్, శొంఠి శివరాంప్రసాద్‌లు స్థానిక నాయకులతో కలిసి పాల్గొని ప్రజలకు టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలను వివరించి వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గ ఎమ్మెల్యేగా బోడె ప్రసాద్‌ను, ముఖ్యమంత్రిగా చంద్రబాబును ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. వారి వెంట బలగం కొండ, షేక్ షకీలా, పండల రజిని, సయ్యద్ షాహినా, తమ్ము అశోక్, ఆరేపల్లి వెంకటేశ్వరరావు, దోసరపూడి ప్రకాష్, తుమ్మల కిషోర్, బాబు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ఏపీ సమగ్రాభివృద్ధి

రాష్ట్రాభివృద్ధి ప్రదాత చంద్రబాబుతోనే ఏపీ సమగ్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు దేవినేని గౌతమ్, స్మిత దంపతులు వ్యాఖ్యానించారు. బుధవారం కానూరు సనత్‌నగర్ 31వ వార్డులో జరిగిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జగన్‌రెడ్డి ఏలుబడిలో రాష్ట్రం ముప్పై ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజమండ్రి మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించి తద్వారా వచ్చే లబ్ధితో కూడిన బాండ్లను పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో చంద్ర బాబును సీఎంగా ఎన్నుకోవాలని కోరారు.

వైసీపీ పతనం ఖాయం : తుమ్మలపల్లి

కంకిపాడు : రాష్ట్రంలో వైసీపీ పతనం ఖాయమైందని టీడీపీ సీనియర్ నాయకుడు తుమ్మల పల్లి హరికృష్ణ అన్నారు. బుధవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ, రానున్న వారం పది రోజుల్లో అధికార వైసీపీ ఖాళీ అవుతుందన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనేక మంది అధికార పార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీలోకి వచ్చేందుకు క్యూ కడుతున్నారని, ఇప్పటికే సగం పార్టీ ఖాళీ అయిందని, మరో పది రోజుల్లో వైసీపీ పతనం ప్రారంభమౌతుందన్నారు. పార్టీ నాయకులు పులి శ్రీనివాసరావు, బొప్పూడి శివరామకృష్ణ, కొండా నాగేశ్వరరావు, ఏనుగ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



కానూరులో జరిగిన కార్యక్రమంలో దేవినేని గౌతమ్, స్మిత దంపతులు

కార్మికుల శ్రమదోపిడీ చేస్తున్న ప్రభుత్వం

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్



కార్మికుల సమ్మెలో పాల్గొని మాట్లాడుతున్న రాజేశ్

ఉయ్యూరు, జనవరి 3 : సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా ప్రభుత్వాలు అరకొర వేతనాలతో కార్మికుల శ్రమ దోపిడీ చేస్తున్నాయని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రాజేశ్ ఆరోపించారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేసి సమానపనికి సమానవేతనం ఇవ్వాలని సమ్మె చేస్తున్న మునిసిపల్ కార్మికులను ప్రభుత్వం పట్టించుకోపోవడ ం దుర్మార్గమన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చిన జగన్ మోహన్‌రెడ్డి మాటతప్పారని విమర్శించారు. సీఐటీయు నాయ కుడు బి రాజేశ్ కార్మికులకు మద్దతు తెలిపి దీక్షా శిబిరంలో కూర్చుని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు చింతయ్య, బాలకృష్ణ, శివయ్య, ఆమడయ్య శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు నిర్మిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

పెనమలూరు, జనవరి 3 : వణుకూరు జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించి ఇస్తామంటూ అమాయకుల వద్ద నుంచి లక్షలు వసూలు చేసి ఇళ్లు నిర్మించి ఇవ్వకుండా మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయంలో స్వయానా ప్రభుత్వ, హౌసింగ్ ఉద్యోగులే లబ్ధిదారులకు దళారిని పరిచయం చేసి డబ్బు ఇప్పించారని లబ్ధిదారులు ఫిర్యాదులో తమ గోడు వెళ్లబోసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రస్తుత ప్రభుత్వంలో విజయవాడ నగరం, తాడిగడప మునిసిపాలిటీ, పెనమలూరు మండలంలోని పలు ప్రాంతాల పేదలకు వణుకూరు జగనన్న లేఅవుట్‌లో ఇళ్లు నిర్మించుకోవడానికి స్థలాలు కేటాయించి ఆఘమేఘాల మీద ఇళ్లు నిర్మించుకోలేని పక్షంలో స్థలాలు పోతాయంటూ అధికారులు చేసిన హడావుడి మేరకు లబ్ధిదారులు అందినకాడికి అప్పులు చేసి ఇళ్ల నిర్మాణానికి పూనుకున్నారు. ఈ క్రమంలో వణుకూరు మూడవ సచివాలయం, నాల్గవ సచివాలయ ఇంజనీర్లు నవీన్, సురేష్‌వర్మలు తమకు పరిచయమున్న ఖనిజం వీర కృష్ణ(విజయకృష్ణ)ను లబ్ధిదారులకు పరిచయం చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టే బాధ్యతను అప్పగించారు. ప్రభుత్వ అధికారుల మాటలు నమ్మిన షుమారు 50మంది లబ్ధిదారులు అధికారుల వత్తిడిని భరించలేక ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తవుతుందని నమ్మి ముందస్తుగా దళారి వీరకృష్ణకు షుమారు ఏభై లక్షలను చెల్లించారు. చెల్లించిన వారిలో ఎక్కువ మంది యనమలకుదురుకు చెందిన రోజువారీ కూలీలే, ఒక్కొక్కరు రూ. 35 వేల నుంచి లక్ష వరకు దళారికి చెల్లించినట్లు తెలుస్తోంది. బుధవారం మోసపోయిన వారిలో యనమలకుదురు ఇందిరానగర్‌కు చెందిన గౌస్ బాషా అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పూర్తి వివరాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

ఉయ్యూరు చేరిన అయోధ్యరామ అక్షింతలు



అక్షింతల వితరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లురాజు

ఉయ్యూరు, జనవరి 3 : ఉయ్యూరులో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అయోధ్య రామ స్వర్ణ అక్షింతల వితరణ కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. అయోధ్యరాముని అక్షింతల రథం పట్టణానికి చేరుకోగా రామ సేవక్ సంఘ కన్వీనర్ ఆర్ఎస్ఎస్ ప్రముఖులు దీవి చిన్మయ పర్యవేక్షణలో చిందా వెంకటేశ్వర్లురాజు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అక్షింతల వితరణ - హిందూ జన జాగృతి యాత్రను వెంకటేశ్వర్లు రాజు జెండా ఊపి ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే అన్నే విజయలక్ష్మి అక్షితలు అందుకుని వితరణ నలు లాంచనంగా ప్రారంభించారు చేవూరి రవి సుధాకర్, బొల్లా ప్రసాద్, పడమట వెంకటేశ్వరరావు, కాగిత శివ, శివనాగరాజు, ఊకోటి శ్రీనివాస్ అశోక్‌చక్రవర్తి, గబ్బిట వెంకటరమణ పాల్గొన్నారు.

పుట్టింటికి వెంకమ్మ పేరంటాలమ్మ



గుణదల, జనవరి 3: సంక్రాంతి జాతర మహోత్సవంలో భాగంగా వెంకమ్మ పేరంటాలమ్మను జాతరకు ముందు పుట్టింటి వారు ఆలయానికి వచ్చి తీసుకెళ్లే కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. రామవరప్పాడులోని గ్రామ దేవత వెంకమ్మ పేరంటాలమ్మ దేవస్థానంలో ఏటా నిర్వహించే సంక్రాంతి జాతరకు ముందు పుట్టింటివారు వచ్చి అమ్మవారిని తీసుకెళ్లడం ఆనవాయితీ. రామవరప్పాడులోని రాజుల బజార్లోని అమ్మవారి పుట్టింటికి తీసుకెళ్లడానికి మేళతాళాలతో వచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారిని పుట్టింటికి తీసుకెళ్లారు. ఆలయ పాలకమండలి అధ్యక్షుడు బోయిన బాను, ఈవో పాతూరి లోకేశ్వరి, పటమట సీఐ కాశీవిశ్వనాథ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి
తల్లీ కూతురు ఆత్మహత్యాయత్నం

ఉంగుటూరు, జనవరి 3 : సెల్‌ఫోన్‌లో ముచ్చట్లు వద్దని వారించినా, కుమార్తె వినకపోవడంతో తీవ్రమనోవేదనకు గురైన తల్లి పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, అదే సమయంలో కూతురు కూడా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన మండల పరిధిలోని పెదఅవుటపల్లిలో మంగళవారం జరిగింది. ఆత్కూరు ఎస్సై టి.సూర్యశ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్‌జిల్లా ఇబ్రహీంపట్నం మండలం, కొండపల్లి ఆశ్రమం కాలనీలో కొప్పుల సురేష్‌కుమార్ భార్య విజయభారతి, కుమార్తె శ్రీనిధితో నివాసముంటున్నాడు. కుమార్తె స్థానిక కాన్వెంట్‌లో 9వ తరగతి చదువుతోంది. ఈ నేపథ్యంలో శ్రీనిధి(14) సెల్‌ఫోన్‌లో అతిగా మాట్లాడటం తల్లి విజయభారతి (35) గమనించింది. కూతురుని వారించింది. వినకపోవడంతో పెదఅవుటపల్లిలోని బ్రదర్ జోసఫ్‌తంబి పుణ్యక్షేత్రానికి తీసుకొచ్చింది. అక్కడ పలువిధాలుగా నచ్చచెప్పేందుకు ప్రయత్నించినా కూతురు వినకపోవటంతో, మనస్తాపం చెందిన తల్లి విజయభారతి వెంట తెచ్చుకున్న పురుగుల మందు కూల్‌డ్రింక్‌లో కలిపి తాగింది. నీతోపాటే నేను అంటూ మిగిలిన మందును కూతురు తాగేసింది. ముందుగా శ్రీనిధికి వాంతులవుతుండటంతో భయపడిన విజయభారతి అజ్జంపూడిలోని తన తమ్ముడు చినబాబుకు ఫోన్‌చేసి పురుగులమందు తాగిన విషయం చెప్పింది. వెంటనే సదరు ప్రదేశానికి చేరుకున్న చినబాబు అపస్మారకస్థితికి చేరిన అక్క, మేనకోడలిని స్థానికుల సాయంతో చినఅవుటపల్లిలోని పిన్నమనేని ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి నిలకడగా వున్నట్లు వైద్యాధికారులు చెప్పినట్లు ఎస్సై తెలిపారు.

గురుకులాలతో సమగ్ర వ్యక్తిత్వ వికాసం

మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్



శ్రీనివేదిత గురుకులం బ్రోచర్‌ను విడుదల చేస్తున్న డాక్టర్ కామినేని శ్రీనివాస్

ఉంగుటూరు, జనవరి 3 : సకల విద్యల్లో మెరుగైన ప్రావీణ్యం సంపాదించే దిశగా విద్యార్థులను తీర్చిదిద్దటంతోపాటు, వారి సమగ్ర వ్యక్తిత్వ వికాసంలో గురుకులాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రమైన ఉంగుటూరులోని శ్రీవిజ్ఞాన విహార సంస్థ ఆధ్వర్యంలో నడుపబడుతున్న శ్రీజయరామా విజ్ఞాన విహార పాఠశాల ప్రాంగణంలో నెలకొల్పుతున్న శ్రీ నివేదిత గురుకులము భవనానికి బుధవారం భూమి పూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శ్రీనివాస్ శ్రీనివేదిత గురుకులము బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర, ప్రాంత ప్రచారక్‌లు శ్రీరామ్‌భరత్, శ్రీవిజయాదిత్య, బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి, పిన్నమనేని సిద్ధార్థ హాస్పటల్ డైరెక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, చదలవాడ సుధా, మోహన్ స్పిన్‌టెక్ ప్రతినిధి సుధాకర్ చౌదరి, శ్రీవిజ్ఞాన విహార విద్యాసంస్థ అధ్యక్షులు బీవీఎస్‌టీ సాయి, కార్యదర్శి ముళ్ళపూడి గోవిందరావు, పత్తి కుమార్, శ్రీజయరామా విజ్ఞానవిహార పాఠశాల హెచ్‌ఎం ఎం.సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీరాజ్ సదస్సుకు మంగళగిరి పయనమైన టీడీపీ సర్పంచ్‌లు

వైసీపీకి బుద్ధి చెప్పాలి : ఆళ్ల

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 3 : పంచాయతీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ గ్రామాల్లోని ప్రజలచే ఎన్నుకోబడిన సర్పంచ్‌లకు గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయకుండా వారి గౌరవానికి భంగం కలిగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని రాష్ట్ర సాగునీటి సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. బాపులపాడు మండలంలోని వీరవల్లి, రంగన్నగూడెం సర్పంచ్‌లతో కలిసి ఆయన బుధవారం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్న పంచాయతీ సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర పంచాయతీరాజ్ సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ పంచాయ తీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షురాలు లక్ష్మీ ముత్యాలరావును మర్యాదపూర్వకంగా కలిసి సంఘీభావం తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటంలో రాష్ట్ర సాగునీటి సమాఖ్య తరఫున తాము కూడా పాల్గొంటామని ఆళ్ల తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	97, 105, 116
చికెన్ విత్ స్కిన్	186
చికెన్ స్కిన్‌లెస్	196

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.85

హుండీల్లో కానుకల లెక్కింపు రేపు

మోపిదేవి, జనవరి 3: సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకల లెక్కింపును శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఎన్.ఎస్. చక్రధరరావు తెలిపారు. ఉదయం 8 గంటలకు ఆలయ ప్రాంగణంలో దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో లెక్కింపును నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల భక్తులు డ్రెస్‌కోడ్ నిబంధనల పాటించి, పాల్గొనాలని సూచించారు.

వాసవీ ఇంటర్నేషనల్ మచిలీపట్నం
క్లబ్ అధ్యక్షుడిగా ఆర్. రవిచంద్ర

మచిలీపట్నం టౌన్, జనవరి 3: వాసవీ ఇంటర్నేషనల్ మచిలీపట్నం క్లబ్ అధ్యక్షుడిగా ఆర్.రవిచంద్ర బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. రామలింగేశ్వర స్వామి దేవాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. మోటమర్రి బాబాప్రసాద్, యెండూరి సురేష్, రంగానాయకులు, శ్రీకాకుళపు రేణుకారాణి, వేముల శిరీష, జల్లూరి గోపి, అన్నం ఆనంద్, వి.కె.ఎస్.మూర్తి పాల్గొన్నారు.



శిడిబండి ఊరేగింపులో పాల్గొన్న మహిళలు, అమ్మవారిని దర్శించుకుంటున్న కాగిత కృష్ణప్రసాద్

వైభవంగా పైడమ్మ సంబరం

పెడన, జనవరి 3: జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తండోపతండాలుగా తరలివచ్చిన భక్తులతో పైడమ్మ సంబరాలు తొమ్మిదో రోజు బుధవారం వైభవంగా జరిగాయి. వేలాది భక్తులు నిజస్వరూపంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. పాలెం శిడిబండ్ల ఊరేగింపు సంబరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దక్షిణ తెలుగుపాలెం, గంజాలవారిపాలెం, పోసినవారిపాలెం, పిండివారిపాలెం గ్రామాల ప్రజలు శిడిబండ్లను కట్టి ఊరేగించారు. ఆలయ ఈవో టి.వి.వి.మోహనరావు, వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయునందనరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి జోగి, కాగిత

మంత్రి జోగి రమేశ్, తన భార్య శకుంతలాదేవి, కుమారుడు రాజీవ్‌లతో కలిసి పైడమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి కాగిత కృష్ణప్రసాద్ టీడీపీ నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

లే అవుట్‌లో ఆక్రమణలు తొలగించాలి

మోపిదేవి, జనవరి 3: మోపిదేవి నుంచి రావివారిపాలెం వెళ్లే దారిలోని లే అవుట్-3లో ఎస్టీ గృహాలకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించాలని జనసేన పార్టీ మండల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్నం లే అవుట్‌ను వారు సందర్శించారు. లే అవుట్‌లో మౌలిక వసతులు లేక పడుతున్న ఇబ్బందులను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో కనీసం రహదారి మార్గం లేక ఎదురుగా ఉన్న డ్రెయినేజీలో నుంచి రాకపోకలు సాగించాల్సి వస్తోందని ఎస్టీలు వాపోయారు. తాగునీరు, మరుగుదొడ్డి వసతి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని తెలిపారు. లే అవుట్ నమూనా ప్రకారం రహదారి నిర్మించాలని, లబ్ధిదారులకు సెంటున్నర చొప్పున స్థలం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ నిబంధనలు ఉల్లంఘించినట్లు తెలిసిందని, లే అవుట్‌లో ఆక్రమణలు తొలగించి మౌలిక వసతులు కల్పించని పక్షంలో ఎస్టీలకు అండగా నిలిచి ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామని జనసేన నాయకులు స్పష్టం చేశారు. పూషడపు రత్నగోపాల్, మెరకనపల్లి నరేష్, బాదర్ల లోలాక్షుడు, భోగిరెడ్డి సాంబయ్య పాల్గొన్నారు.



మహిళలను అడిగి లే అవుట్‌లో సమస్యలను తెలుసుకుంటున్న జనసేన నాయకులు

అభివృద్ధి చేతకాక పవన్‌పై విమర్శలా?

- ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌పై జనసేన మండల నేతల ఆగ్రహం

మోపిదేవి, జనవరి 3: అభివృద్ధి చేతగాని ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబుకు తమ పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను విమర్శించే నైతికత లేదని జనసేన పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ కార్యాలయం వద్ద బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పింఛన్ల పంపిణీలో పవన్‌పై ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. కాపు సామాజికవర్గం అధికంగా ఉన్న నియోజకవర్గం నుంచి కాపుల ఓట్లతో గెలుపొంది నాలుగేళ్ల తర్వాత పవన్‌ను విమర్శించటం సరికాదన్నారు. నియోజకవర్గానికి ఏం అభివృద్ధి చేశారో బహిరంగంగా చర్చకు సిద్ధమా అంటూ ఆయనకు సవాల్ విసిరారు. పార్టీ మండల అధ్యక్షుడు పూషడపు రత్నగోపాల్, నాయకులు మెరకనపల్లి నరేష్, భోగిరెడ్డి సాంబయ్య, కామిశెట్టి శ్రీనివాసరావు, కేతరాజు శ్రీను, యర్రంశెట్టి లెనిన్, నాదెండ్ల శరత్ చంద్రబాబు, రావి రత్నగిరి ఉన్నారు.

టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించండి

- జనసేన శ్రేణులకు బండి రామకృష్ణ పిలుపు

మచిలీపట్నం టౌన్, జనవరి 3: రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని పార్టీ శ్రేణులకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం కానూరులో తెలుగురైతు కృష్ణాజిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణతో కలిసి ఆయన పర్యటించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వాకాలరావుకు ఆర్థిక సాయాన్ని అందించారు. మచిలీపట్నంలో వైసీపీ అభ్యర్థిగా ఎవరు పోటీ చేసినా ఓటమి తప్పదని గోపు సత్యనారాయణ అన్నారు. జనసేన నాయకులు గడ్డం రాజు, వంపుగడల చౌదరి, కొట్టె వెంకట్రావు, మోకా రవి, శ్రీపతి వాకాలరావు, కూనపరెడ్డి ప్రసాద్, రాఘవ, మహేష్, గణపతి తదితరులు పాల్గొన్నారు.



కానూరులో వాకాలరావుకు ఆర్థిక సాయం అందిస్తున్న బండి రామకృష్ణ, గోపు సత్యనారాయణ

ఆరోగ్యశ్రీపై అపోహలొద్దు

గుడివాడ: రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25లక్షలకు పెంచిందని, చికిత్స విషయంలో అపోహలొద్దని ఎమ్మెల్యే కొడాలి నాని అన్నారు. బుధవారం రాజేంద్రనగర్‌లోని తన స్వగృహంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కృప అనే విద్యార్థినికి మెరుగైన వైద్యాన్ని అందించేలా సహకరించాలని విద్యార్థిని కుటుంబసభ్యులు కొడాలి నానిని కోరారు. స్థానిక ఏరియా ఆస్పత్రి సూరింటెండెంట్ ఇందిరాదేవికి ఫోన్ చేసి గాయపడిన కృపకు మెరుగైన చికిత్స నందించాలని ఆయన ఆదేశించారు.



బందరులో సావిత్రీబాయి ఫూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కొల్లు రవీంద్ర, కలెక్టరేట్ వద్ద అంగన్వాడీ సంఘం నేతలు, చల్లపల్లిలో ప్రజాసంఘాల నేతలు



తోట్లవల్లూరులో నివాళులర్పిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

ఆదర్శమూర్తి సావిత్రీబాయి ఫూలే

జయంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన రాజకీయ నేతలు, బీసీ సంఘాల నేతలు, అధికారులు



గుడివాడలో నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

మచిలీపట్నం టౌన్, జనవరి 3: మహిళల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయిఫూలే అందరికీ ఆదర్శమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. జయంతి సందర్భంగా టీడీపీ కార్యాలయంలో సావిత్రీబాయి ఫూలే చిత్రపటానికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్యతో కలిసి ఆయన నివాళులర్పించారు. నేతలు గొర్రెపాటి గోపీచంద్, ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, లంకే నారాయణప్రసాద్, చిత్తజల్లు నాగరాము, లంకిశెట్టి నీరజ, కట్టా అంజిబాబు, కరెడ్ల సుశీల, గుమ్మడి విద్యాసాగర్ పాల్గొన్నారు. జనసేన నియోజకవర్గ కార్యాలయంలో సావిత్రీబాయిఫూలే చిత్రపటానికి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ నివాళులర్పించారు. గడ్డం రాజు, వంపుగడల చౌదరి పాల్గొన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయంలో కేయూ వీసీ జ్ఞానమణి, రిజిస్ట్రార్ పి.వీరబ్రహ్మచారి, ఆర్ట్స్అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ సుందరకృష్ణ, ఉష తదితరులు నివాళులర్పించారు. కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీ కార్యకర్తల ఉద్యమ సమయంలో సావిత్రీబాయి ఫూలే చిత్రపటానికి అంగన్వాడీ కార్యకర్తల జిల్లా సంఘ అధ్యక్షురాలు నిర్మల జ్యోతి నివాళులర్పించారు.జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రమాదేవి, ప్రాజెక్టు కార్యదర్శి రెజీనారాణి, సీపీఎం జిల్లా కార్యదర్శి వైనరసింహారావు, సీఐటీయూ నాయకుడు బి.సుబ్రహ్మణ్యం నివాళులర్పించారు.

గుడివాడ: మెయిన్‌రోడ్డులోని ఫూలే దంపతుల విగ్రహాలకు నియోజకవర్గ బీసీ సంఘం నాయకులు నివాళులర్పించారు. నియోజకవర్గ అధ్యక్షుడు దారం నరసింహారావు, రావులకొల్లు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు. ఆర్కే జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ గుడివాడ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సావిత్రీబాయి ఫూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఎస్.సమీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అవనిగడ్డ రూరల్: రామచంద్రపురం పంచాయతీ కార్యాలయంలో సావిత్రీబాయి ఫూలే చిత్రపటానికి సర్పంచ్ వాకా రమేష్ నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి బండే శేషగిరిరావు పాల్గొన్నారు.

నాగాయలంక: మత్స్యభవనం వద్ద సావిత్రీబాయి ఫూలే చిత్రపటానికి బీసీ నేత, ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు నివాళులర్పించారు. కె.సత్యనారాయణ, కె.నరసింహారావు, వాటిపల్లి భిక్షం పాల్గొన్నారు.

చల్లపల్లి: చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో సావిత్రీబాయి ఫూలే చిత్రపటానికి వివిధ వర్గాల ప్రముఖులు, ప్రజాసంఘాల నేతలు నివాళులర్పించారు. విశ్రాంత ఈవోఆర్డీ దాసి సీతారామరాజు, అడ్డాడ ప్రసాద్ బాబు, కైతేపల్లి దాస్, ఉప్పల సాంబశివరావు, కేశనకుర్తి శరత్‌బాబు, కోడూరు వెంకటేశ్వరరావు, బత్తుల ప్రసాద్, అల్లూరి బాబూరావు, అన్నపరెడ్డి శ్రీనివాసరావు, సిద్ధాబత్తుల వాసు, ఓగిరాల నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: నీలకంఠేశ్వరపురం ఎంపీపీ పాఠశాలలో సావిత్రీబాయి ఫూలే చిత్రపటానికి జిల్లా ఉపాధ్యాయ సంఘ గౌరవాధ్యక్షుడు నీలం ప్రభాకర్ నివాళులర్పించారు. సంఘ నాయకులు కె.ఎల్.శ్రీనాథ్, ఎన్.చంద్రకళ, వి.నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: మండల పరిషత్ కార్యాలయంలో బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) ఆధ్వర్యంలో సావిత్రీబాయి ఫూలే చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, ఎంపీడీవో టి.స్వర్ణలత, తహసీల్దార్ ఎం.కుసుమకుమారి, ఎంఈవో జి.వెంకటేశ్వరరావు, ఎంఈవో-2 బి.సురేష్, బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టా రాజేష్, నాయకులు వీవీ సాంబశివరావు, పి.పాల్, రాజా రాయల్, వి.సుమన్, జి.పీటర్సన్ తదితరులు పాల్గొన్నారు.



యలకుర్రులో కరపత్రాలు పంచుతున్న వర్ల కుమార్‌రాజా, అవనిగడ్డలో మండలి వెంకట్రామ్, చల్లపల్లిలో టీడీపీ మండల నేతలు

వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో విరక్తి

- అందుకే సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారు
- బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో వర్ల కుమార్ రాజా

పామర్రు, జనవరి 3: వైసీపీ ప్రభుత్వ పాలనపై రాష్ట్ర ప్రజలు విరక్తి చెందారని, ఆ పార్టీని వచ్చే ఎన్నికల్లో సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని టీడీపీ పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జి వర్లకుమార్‌రాజా అన్నారు. ఎల కుర్రులో బుధవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల్ని నమ్మించి అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అన్ని వర్గాల ఉసురు పోసుకుంటున్నాడన్నారు. ఇంటింటికీ తిరుగూ టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, గోపాలకృష్ణ, శివరామ ప్రసాద్, సాయిమురళి, పార్టీ గ్రామ నేతలు కొనకళ్ల నాగార్జున, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అవనిగడ్డ: అవనిగడ్డ ఒకటో వార్డులోని ఆర్టీసీ కాలనీ, ఎస్టీ కాలనీలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నాయకులు నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలను ప్రజలకు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ వివరించారు. యాసం చిట్టిబాబు, మాచవరపు ఆదినారాయణ, అన్నపరెడ్డి లక్ష్మణ, లుక్కా శ్రీనివాసరావు, చెన్ను గాంధీ, బచ్చు రఘునాథ్, మెగావత్తు గోపి, ఘంటసాల కన్నయ్య, విశ్వనాథుని మురళీ మోహన్, బర్మా శ్రీను, యలవర్తి ఆది, గరికపాటి హరి, బొప్పన బాహుజీ, డేగల రాఘవ, మత్తి ప్రసాద్, కూనపరెడ్డి చంద్రశేఖర్, రేపల్లె కృష్ణారావు, గుడివాక పద్మాయి, బచ్చు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చల్లపల్లి: టీడీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని 71వ బూత్ పరిధిలో బుధవారం నిర్వహించారు. టీడీపీ నేతలు ఇంటింటికీ వెళ్లి గతంలో చంద్రబాబు మినీ మేనిఫెస్టోగా విడుదల చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియచేశారు. మోర్ల రాంబాబు, మోర్ల శివ, షేక్ నబీషోరి, పైడిపాముల స్వప్న, కళత్తూరి నాంచారయ్య, నడకుదిటి ఏసునారాయణ, షణ్ముఖ పవన్, నాంచారయ్య, బాలాజీ పాల్గొన్నారు.



కోడూరులో కరపత్రాలు పంచుతున్న బండే శ్రీనివాసరావు

జగన్ మాట తప్పారు..మడమ తిప్పారు

కోడూరు: కోడూరు-అవనిగడ్డ ప్రధాన రహదారి వేస్తామని చెప్పి 18 నెలలు కావొస్తున్నా ఇప్పటికీ వేయకుండా ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన మాట తప్పారని..మడమ తిప్పారని జడ్పీటీసీ మాజీ సభ్యుడు బండే శ్రీనివాసరావు విమర్శించారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని కోడూరు 190 పోలింగ్ బూత్ పరిధిలో బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, వీరంకి వెంకటేశ్వరరావు, పిల్లి మల్లికార్జునరావు, మల్లాది ప్రసాద్, మాలెంపాటి శ్రీమన్నారాయణ, దామెర్ల రామాంజనేయులు, మహమ్మద్ ఇమ్రాన్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



బందరులో కోర్టు వద్ద రిలే నిరాహార దీక్ష నిర్వహిస్తున్న న్యాయవాదులు

16వ రోజుకు న్యాయవాదుల రిలే దీక్షలు

మచిలీపట్నం టౌన్, జనవరి 3: ప్రజల హక్కులను కాలరాసే ఏపీ ల్యాండ్ టైటలింగ్ యాక్టును రద్దు చేయాలంటూ మచిలీపట్నం న్యాయవాదుల చేస్తున్న రిలే దీక్షలు బుధవారానికి 16వరోజుకు చేరుకున్నాయి. ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తుంగల హరిబాబు, కార్యదర్శి కొట్టె రఘురాం, ఉపాధ్యక్షుడు మట్టా వెంకటసుబ్బారావు, సీనియర్ న్యాయవాదులు పి.సూర్యప్రకాష్, పుప్పాల సూరిబాబు, అజ్మతున్నీసా, లలితకుమారి, ప్లీడరు గుమాస్తాల సంఘం నేత వీవీఫణికుమార్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలోకి..

అవనిగడ్డ, జనవరి 3: అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన వైసీపీ నేత, సామాజిక సేవా కార్యకర్త మాదివాడ వెంకటకృష్ణ (బ్రదర్ క్రిస్టియన్) బుధవారం జనసేన పార్టీలో చేరారు. బుధవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో క్రిస్టియన్‌కు పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అవనిగడ్డ నియోజకవర్గంలో సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా ఉండే బ్రదర్ క్రిస్టియన్ వైసీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో కీలకంగా వ్యవహరించిన వ్యక్తి. ఆయన వైసీపీని వీడి జనసేనలోకి చేరడం నియోజకవర్గంలో వైసీపీకి ఎదురుదెబ్బే అని చెబుతున్నారు. ఆయన వెంట రాయపూడి వేణుగోపాలరావు, చిలకలపూడి పాపారావు, గుడివాక శేషుబాబులు మంగళగిరి తరలివెళ్లారు.



కండువా కప్పి మాదివాడ వెంకటకృష్ణను పార్టీలోకి ఆహ్వానిస్తున్న పవన్ కల్యాణ్

వృద్ధాశ్రమానికి వితరణ

మచిలీపట్నం టౌన్, జనవరి 3: రాజుపేటలోని వృద్ధుల ఆనంద ఆశ్రమానికి బుధవారం లంకిశెట్టి ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు రూ.15 వేల విలువైన రగ్గులు, స్టీలు గిన్నెలు పంపిణీ చేశారు. మామిడి మురళీకృష్ణ, లంకిశెట్టి బాలాజీ, ఘంటసాల గురునాథబాబు, మాదిరెడ్డి అంజిబాబు, రవికుమార్, ప్రీతమ్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సమావేశానికి
తరలిన నేతలు

గుడివాడ: మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్న సర్పంచ్‌ల రాష్ట్ర సమావేశానికి నియోజకవర్గం నుంచి సర్పంచ్‌లు తరలివెళ్లారు. బుధవారం బైపాస్ రోడ్డులోని టీడీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా తరలివెళ్లారు. నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు కాకరాల సుభాష్‌చంద్రబోస్(సురేష్), సర్పంచ్‌లు సింగాల రాధాకృష్ణ, కన్నె భాస్కరరావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కోడూరు మండలం నుంచి..

కోడూరు: రాష్ట్ర సర్పంచ్‌ల సమావేశానికి కోడూరు మండల టీడీపీ, జనసేన సర్పంచ్‌లు హాజరయ్యారు. మంగళగిరిలోని సికే కన్వర్షన్ హాలు నందు జరిగిన సమావేశంలో పాలడుగు ఆనందరావు, దేవనబోయిన వెంకటేశ్వరరావు, యర్రం చిట్టి దామోదరరావు, కనగాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నరకం చూసిన పింఛన్‌దారులు

తోట్లవల్లూరు, జనవరి 3: పెనమకూరులో నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు కార్యక్రమమని చెప్పి, అన్ని గ్రామాల నుంచి లబ్ధిదారులను అధికారులు తీసుకొచ్చారు. మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఎమ్మెల్యే కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. దీంతో అనేకమంది ఆకలిదప్పులతో అలమటించారు. పెనమకూరులో రూ 1.12 కోట్లతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం పింఛన్లను పంపిణీ చేశారు.

నేటి నుంచి పింఛన్లు అందిస్తాం

కూచిపూడి: ప్రతీనెలా అందించే సామాజిక పింఛన్లను గురువారం నుంచి అందించనున్నట్లు ఎండీవో సుధాప్రవీణ్ తెలిపారు. మొవ్వ మండలానికి నూతనంగా 115 పింఛన్లు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు.

మాదిగ విద్యార్థి మహాసభను జయప్రదం చేయండి

చల్లపల్లి, జనవరి 3: ఎమ్మార్పీఎస్ అనుబంధ విభాగం మాదిగ విద్యార్థి సమాఖ్య జాతీయ కమిటీ పిలుపుమేరకు ఈనెల ఆరో తేదీ శనివారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించే మాదిగ విద్యార్థి సమాఖ్య జాతీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొక్కిలిగడ్డ సువర్ణరాజు పిలుపునిచ్చారు. బుధవారం అవనిగడ్డ నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. చల్లపల్లిలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గం నుంచి విద్యార్థులు, యువత మహాసభకు తరలిరావాలని కోరారు. జిల్లా నాయకుడు కొక్కిలిగడ్డ శ్రీకాంత్, నేతలు కొడాలి ఏలియా, మోటుపల్లి వికాస్, అనపర్తి సునీల్, గుర్విందపల్లి భూపేష్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పమిడిముక్కల, జనవరి 3: హనుమంతపురంలో ఇటీవల అగ్నిప్రమాదంలో ఇంటితో పాటు ఇంటిలోని సర్వం కాలిపోయి కట్టుబట్టలతో మిగిలిన కాగిత కాకాని కుటుంబానికి టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థిక సాయాన్ని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ వర్ల కుమార్‌రాజా, పార్టీ గ్రామ అధ్యక్షుడు పరుచూరి వెంకటేశ్వరరావు, లింగనేని బాబూరావు బుధవారం అందజేశారు. కొల్లూరి జయచంద్, ఇంటూరి రమేశ్, గోపాలకృష్ణ, మోపిదేవి శివనాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సూరపనేని సీతారామయ్య, పెద్ది శివాజీ పరామర్శించిన వారిలో ఉన్నారు.

యోగా సాధనతో ఏకాగ్రత

మచిలీపట్నం టౌన్, జనవరి 3: యోగా సాధనతో ఆరోగ్యంతో పాటు విద్యార్థులకు ఏకాగ్రత పెరుగుతుందని ఉత్తరప్రదేశ్ యోగ ప్రొఫెసర్ డాక్టర్ దమయంతి అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ మచిలీపట్నం యోగసభ ప్రతినిధి, యోగ గురువు గురునాథబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన తరగతుల్లో ఘంటసాల మహాలక్ష్మి, మాదివాడ రాము, రెడ్‌క్రాస్ అధ్యక్షుడు తోట బాలాజీ, యోగసాధకులు ఆర్.డి. ప్రసాద్, ప్రిన్సిపాల్ తలశిల దామోదర్, 'మానవత' అధ్యక్షుడు పి.సాయికృష్ణప్రసాద్, ఉల్లి రంగారావు మాట్లాడారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత

కూచిపూడి, జనవరి 3: బాలల సంరక్షణ అందరి బాధ్యతగా గుర్తించాలని సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. మొవ్వ పంచాయతీ ఆధ్వర్యంలో బాలల గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి కేవీ సోమేశ్వరరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ మహేష్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అక్షితల పంపిణీ

పెడన, జనవరి 3: వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షితల పంపిణీని బీజేపీ పట్టణ నాయకులు మామిడి లక్ష్మీనారాయణ గుప్తా, కొల్లూరి రాధాకృష్ణ గుప్తాలు బుధవారం ప్రారంభించారు. తొలిగా ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొల్లూరి చిన్నా, ప్రధాన అర్చకుడు స్వర్ణ సాయిబాబుకు అక్షితలు అందించారు. పట్టణ పరిధిలో ఏడు వేల హిందూ కుటుంబాలకు అక్షితలు అందిస్తామని, ఈనెల 22వరకు దేవుని మందిరంలో ఉంచి పూజించిన పిదప తలమీద వేసుకోవాలని వారు సూచించారు.

కేంద్రం పథకాలను ప్రజలకు వివరించాలి

నాగాయలంక, జనవరి 3: రాష్ట్రం ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను లబ్ధిదారులకు, ప్రజలకు వివరించాలని అధికారులను ఈవోపీఆర్డీ అప్పల నరసమ్మ ఆదేశించారు. మండలంలో నిర్వహిస్తున్న భారత్ వికసిత్ సంకల్ప యాత్ర గ్రామసభలు బుధవారం పర్రచివర, పెదపాలెంలో ముగిశాయి. ఏవో ఎ.సంజీవ కుమార్, పంచాయతీ కార్యదర్శి పి.మల్లికార్జునరావు, వీఆర్వో కె.వెంకటేశ్వరరావు, వైద్యాధికారి రాజేశ్వరరావు, పోస్టల్, వెలుగు, ఉపాధి, గ్యాస్ సిబ్బంది పాల్గొన్నారు.